విడిసిలనే బహిష్కరిద్దాం

- అణగారిన వర్గాలన్నీ కలిసి ఊర్ల నుంచి విడిసిలను తరిమేయాలి
- చర్యలకు వెనకాడుతున్న కలెక్టర్, సిపి రాజీనామా చేయాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లోని అణగారిన వర్గాలపై అధిపత్యం చెలాయించేందుకు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (విడిసి) ముసుగులో పెత్తందారులు అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని, రాజ్యాంగానికి విరుద్ధంగా, చట్టానికి వ్యతిరేకంగా గ్రామస్తులపై అనేక ఆంక్షలు విధిస్తున్న విడిసిలను బహిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్‌చేశారు. చేతివృత్తులకు, కులవృత్తిదారులకు ఉన్న హక్కులను విడిసిలు లాగేసుకుంటున్నాయని, ఇకపై వారి దుశ్చర్యలను ఉపేక్షించేది లేదని తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గౌడకులస్తులను బహిష్కరించిన విడిసి... ఇటీవల శ్రీరామ నవమి వేడుకల్లో పూజలు చేసేందుకు వచ్చిన గౌడ సామాజిక తరగతి మహిళలను ఆలయం నుంచి తిప్పి పంపిన విషయం విధితమే. తాజాగా గౌడకులస్తులకు చెందిన ఈతవనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈతవనం దహనమైంది. ఈ నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ.. ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు, పార్టీ జిల్లా కమిటీ నాయకులతో కలిసి తాళ్లరాంపూర్ గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ముందుగా దహనమైన ఈతవనాన్ని పరిశీలించారు. గౌడసంఘానికి చెందిన 10 ఎకరాల సొంత స్థలంలో ఏర్పాటు చేసుకున్న ఈ ఈతవనంలో సుమారు వంద ఈత చెట్లు దెబ్బతిన్నట్టు గౌడకులస్తులు జాన్‌వెస్లీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గౌడ కులస్తులతో వారి సంఘం భవనంలో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా విడిసి తమపై పెట్టిన ఆంక్షలను సుదర్శన్‌గౌడ్ ఎకరవు పెట్టారు. మరో మహిళ లలిత.. రామాలయం నుంచి తమను బయటకు పంపించివేసిన ఘటనను వివరించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. విడిసి ఆంక్షలు పెడుతుందని ఫిర్యాదు చేసినా అటు అధికారులు కానీ, ఇటు పాలకులు కానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామంలో అధికారమే ధ్యేయంగా, వారు చెప్పిందే వేదంగా నడవాలని విడిసి అణగారిన కులాలపై అనేక ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమని తెలిపారు. తాటిచెట్లు ఎక్కడం లేదు కాబట్టి వాటిని విడిసికి ఇవ్వాలని కండీషన్ పెట్టి అందుకు కుదరదన్నందుకు గౌడ కులస్తులను బహిష్కరిస్తారా అని నిలదీశారు. మరి దున్నే వాడికే భూమి ఇస్తారా అని, వీడిసీ నాయకులు తమ భూముల్లో దుక్కి దున్నుతున్నారా.. నాట్లు వేస్తున్నారా.. కోతలు కోస్తున్నారా.. అవి చేయట్లేరు కాబట్టి ఆ భూములను పంచుతారా అని ప్రశ్నించారు. దున్నేవాడికే భూమి ఇస్తే ఈత చెట్లను సైతం విడిసికి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. ఆనవాయితీ ప్రకారం గతేడాది విడిసికి రూ.1.30 లక్షలు ఇచ్చిన గౌడ సంఘం.. ఈసారి సైతం ఎంతోకొంత ఇచ్చేందుకు సిద్ధపడగా.. వారి జీవనోపాధిని దెబ్బతీసే విధంగా తాటిచెట్లు ఇవ్వాలని హుకుం జారీ చేయడం ఎంత వరకు సబబని అన్నారు. గీత కార్మిక సొసైటీలో సభ్యత్వం ఉన్న పలు దళిత కుటుంబాలపై ఆంక్షలు విధించడం, కులం పేరుతో దూషించినందుకు కేసు పెడితే.. కేసుకు తిరుగుతున్నందుకు ఖర్చులను సైతం దళిత సంఘం నుంచి ఇవ్వాలని హుకుం జారీ చేయడం దుర్మార్గమన్నారు. గౌడ కులస్తులే నిర్మించిన ఆలయంలో పూజలు చేసేందుకు మహిళలు వస్తే పూజారితో వారిని వెళ్లగొట్టించడం అంటే.. గ్రామంలో రాజ్యాంగం అమలవుతుందా.. అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఊడిగం చేయడం కాదు.. ప్రజల హక్కుల కాపాడాలి

కాగా గౌడకులస్తులను బహిష్కరించి వారిని వేధింపులకు పాల్పడుతున్న విడిసిపై చర్యలు తీసుకోవాలని బాధితులు అటు సిపికి, ఇటు అధికారులకు పలుమార్లు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడంతో విడిసి ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందని జాన్‌వెస్లీ అన్నారు. కలెక్టర్ సైతం ఉపేక్షించబోమని ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు గ్రామాన్ని సందర్శించింది లేదన్నారు. గ్రామస్తుల హక్కులు కాపాడాల్సింది పోయి.. పెత్తందారుల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్రామాన్ని సందర్శించి బాధితులను మాట్లాడాలని, వారికి నష్టపరిహారం చెల్లించాలని, ఆధిపత్యం చెలాయిస్తున్న విడిసి సభ్యులను అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. విడిసికి వ్యతిరేకంగా తాళ్లరాంపూర్ గౌడ కులస్తులు చేస్తున్న పోరాటం కొనసాగించాలని, సిపిఎం, ప్రజాసంఘాలు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. విడిసి తీరు, గౌడ కులస్తుల ఇక్కట్లపై సిఎం దృష్టికి, డిజిపి దృష్టికి తీసుకెళ్తామని, అప్పటికీ పరిష్కరించకుంటే ఆర్మూర్ డివిజన్‌లో ఉన్న గ్రామస్తులతో కలిసి చలో తాళ్లరాంపూర్‌కు పిలుపునిస్తామని స్పష్టం చేశారు.

15, 16 తేదీల్లో జిల్లాలో ఆందోళనలు : పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

విడిసిల దుశ్చర్యలపై ఈ నెల 15, 16వ తేదీల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసనలు చేపట్టి వినతిపత్రాలు సమర్పించనున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. రాజ్యాంగానికి, చట్టానికి వ్యతిరేకంగా పని చేస్తున్న విడిసిలపై నిషేధం విధించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనల చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లుగౌడ్, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడత రవీందర్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్, తదితరులు పాల్గొని వారికి మద్దతు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న టి సాగర్

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 20న గ్రామీణ భారత్ బంద్

- జయప్రదం చేయాలని టి సాగర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా మే 20న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం వనపర్తిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.బాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతుల జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసిన కార్పొరేట్లకు దోచిపెడుతోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును సైతం బలవంతంగా అణచివేస్తోందని తెలిపారు. నిరసన తెలిపే పౌరుల రాజ్యాంగ హక్కు ప్రజాస్వామ్య సమాజానికి పునాది రాయి అని అన్నారు. రైతుల రుణాలను మాఫీ చేసి, రుణ విమోచన చట్టం చేయాలన్నారు. పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా సవరించాలని తెలిపారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా వారిని అప్పుల నుంచి విముక్తి చేయాలని కోరారు. పదేండ్లలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందని, కానీ ఒక్క రూపాయి కూడా రైతు రుణాన్ని మాఫీ చేయలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్ బంద్‌లో రైతు సంఘాలతో పాటు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగస్వామ్యం కావాలని కోరారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు సన్నద్ధం కావాలి

- కులం, మతం పేరుతో ప్రజలు, కార్మికుల మధ్య వైష్యమ్యాలు పెంచుతున్న మోడీ సర్కార్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకై పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలని, పోరాటాల్లోకి రాకుండా కులం, మతం పేరుతో ప్రజలు, కార్మికుల మధ్య వైష్యమ్యాలు మోడీ ప్రభుత్వం పెంచుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. ఏప్రిల్ 11 నుంచి 14 వరకు సామాజిక వారోత్సవాల్లో భాగంగా సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం" అనే అంశంపై జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆధునిక కాలంలోనూ సమాజాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్నదని అన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు మన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ రాజ్యాంగాలను రూపొందించుకున్నాయని గుర్తుచేశారు. కానీ మతోన్మాద శక్తులు మన రాజ్యాంగంపై దాడులు చేస్తూ దేశాన్ని అన్ని విధాలా అధోగతి పాలుచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో పడ్డ దేశాన్ని రక్షించుకొనేందుకు ప్రజలే ముందుకు రావాలన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ చిత్త శుద్ధిని తెలియజేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండకుండా నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి అప్పనంగా అప్పుజెప్తోందని విమర్శించారు. సహజ వనరులతో సహా ప్రజా ధనాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ, ప్రజల్లో మత, కుల వైషమ్యాలకు కారణమైన మోడీ ప్రభుత్వంపై పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలన్నారు. గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తూ ప్రజలపై భారాలు మోపుతుందని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు రూ.16 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో రానున్న కాలంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్, సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్‌సిటీ మెట్రో కారిడార్‌లో జోరుగా స్థల సేకరణ

- ఉత్సాహంగా ముందుకొస్తున్న భూయజమానులు
- 205 ప్రభావిత ఆస్తులకు సంబంధించి రూ. 212 కోట్లకు చెక్కుల పంపిణీ
- కేంద్ర అనుమతి రాగానే మెట్రో నిర్మాణ పనులు ప్రారంభం : మెట్రో ఎండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెట్రో రైలు విస్తరణలో భాగంగా ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుని, కూల్చి వేసే కార్యక్రమం స్థానికుల పూర్తి సహాయ సహకారాలతో ముమ్మరంగా సాగుతోందని చెప్పారు. మొత్తం ఈ మార్గంలో 1100 ప్రభావిత ఆస్తుల ఉండగా ఇప్పటి వరకు 205 ఆస్తులకు చెక్కుల పంపిణీ జరిగిందని, ఆయా ఆస్తులకు సంబంధించిన రూ. 212 కోట్ల నష్టపరిహారం ఇప్పటికే చెల్లించినట్టు వెల్లడించారు. ఈ మార్గంలో ఇరువైపులా చిక్కు ముడులుగా ఉన్న కొన్ని క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్ కేబుళ్లను అత్యంత అప్రమత్తంగా తొలగించి తమ ఇంజినీరింగ్ సిబ్బంది మార్గాన్ని సుగమం చేశారని తెలిపారు. మెట్రో అధికారులతో పాటు, రెవెన్యూ, పోలీస్ పర్యవేక్షణలో మెట్రో మార్గం విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులు స్వచ్ఛందంగా స్పందించి సర్కారు నిర్ణయించిన నష్టపరిహారాన్ని ఆమోదించి ముందుకు వచ్చి తమ ఆస్తులను మెట్రో మార్గం కోసం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం పలు భవనాలు, కట్టడాలను కూల్చివేసి, అవశేషాలను తొలగించినట్టు చెప్పారు. సున్నితమైన కట్టడాలకు ఎటువంటి ముప్పు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రంజాన్ సందర్భంగా విస్తరణ పనుల వేగం కొంత తగ్గినప్పటికీ, ఇప్పుడు మళ్లీ పుంజుకుని సజావుగా సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు త్వరితగతిన పాతనగరం విస్తరణ పనులు పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వ అనుమతి రాగానే మెట్రో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు.

పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని తెలంగాణ పౌరస్పందన వేదిక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. "ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువుల్లో అంతరాలు పోవాలి" అనే నినాదంతో తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడులను సందర్శించేలా ప్రచార జాతను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వం పేదలకు విద్యా వైద్యాన్ని ఉచితంగా అందిస్తే పేదల బతుకులు మారడమే కాకుండా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలన్నింటిలో ప్రీ ప్రైమరీ తరగతులను జూన్‌లోగా ప్రారంభించాలని కోరారు. గ్రేటర్ పరిధిలో కొత్తగా ఏర్పడిన నివాస ప్రాంతాల్లో కొత్త ప్రభుత్వ బడులను పెట్టాలని, మధ్యాహ్న భోజనాన్ని ఆయా బడుల్లోనే ఏజెన్సీల ద్వారా వంట చేయించి పెట్టాలన్నారు. విద్యా పాలన వ్యవస్థలో బడుల సంఖ్య, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఈఓలు, డిప్యూటీ ఇఒలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలల నిధులకు రూ. 5,000 కోట్ల గ్రాంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా రిజర్వేషన్లు అమలు చేయాలి : మంద కృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఉద్యమాన్ని చేపడతామని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంద కృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ మనదేశంలోనే ఉందన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేద్కర్ వంటి మహనీయుల కుటుంబాలకు మనమెంతో రుణపడి ఉండాలన్నారు. ఆ ముగ్గురు పుట్టకపోతే, పేద వర్గాలకు ఎలాంటి అవకాశాలు దొరికేవి కావని తెలిపారు. 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని, నేడు రాజ్యాంగం, సుప్రీంకోర్టు తీర్పు వల్ల సాధించుకోగలిగామని తెలిపారు. వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉప కులాలకు వెయ్యి ఏళ్ల భవిష్యత్తు ఉందని తెలిపారు.

వ్యవసాయ వర్సిటీ నుంచి ఐదు ఉత్తమ మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదల

- విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల రూపొందించిన 5 ఉత్తమమైన మొక్కజొన్న హైబ్రిడ్ రకాలను విడుదల చేశామని విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా విడుదలైన హైబ్రిడ్ రకాలు దక్కన్ హైబ్రిడ్ మక్క 144, డీహెచ్‌ఎం 182, డిహెచ్‌ఎం 193, డిహెచ్‌ఎం 206, డిహెచ్‌ఎం 218తో కలిపి ఈ విశ్వవిద్యాలయం నుంచి మొత్తం 24 మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదలయ్యాయని తెలిపారు. ఇందులో డిహెచ్‌ఎం 144 (తెలంగాణ మక్క - 6) రకంలో అధిక పిండి పదార్థాలు ఉండటం వల్ల ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. అదే విధంగా డిహెచ్‌ఎం 206 (తెలంగాణ మక్క - 3) మెట్ట సాగుకు అనుకూలమైనదని, ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందని పేర్కొన్నారు.

అంతేకాకుండా ప్రస్తుతం రైతాంగానికి అందుబాటులో ఉన్న వివిధ మొక్కజొన్న వంగడాలతో పోల్చితే డిహెచ్‌ఎం అన్ని విధాలుగా మేలైందని పరిశోధనలో తేలిందని వివరించారు. కాబట్టి ఈ సదవకాశాన్ని రాబోయే కాలంలో రైతాంగం వినియోగించుకోవాలని సూచించారు.

16 పంట రకాలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటిత రకాలుగా గుర్తింపు

ఈ మధ్య కాలంలో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన 16 వివిధ పంటల రకాలకు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖలో జరిగిన సమీక్షా సమావేశంలో అధికారిక ప్రకటిత రకాలుగా (నోటిఫైడ్ వెరైటీస్) గుర్తిస్తూ ప్రకటన విడుదల చేశారు. తద్వారా జయశంకర్ వర్సిటీ విడుదల చేసిన ఈ పంట రకాలను కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ద్వారా విత్తనోత్పత్తి ప్రణాళికలు రూపొందించి ఈ రకాలను రైతాంగానికి అందుబాటులోనికి తేవడానికి సహకరిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ విత్తన సంస్థలు ఈ రకాల మూల విత్తన సరఫరా కొరకు విశ్వవిద్యాలయాన్ని సంప్రదించాలని విశ్వవిద్యాలయ అధికారులు సూచిస్తున్నారు.

వడగాల్పులు... అకాల వర్షాలు

- క్రమంగా పెరుగుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- పలు ప్రాంతాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓవైపు వడగాల్పులు..మరోవైపు అకాల వర్షాలతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో ఆదివారం పలు చోట్ల వర్షం కురిసింది. ఆదివారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 60 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో అత్యధికంగా 4.23 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ములుగు, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు వాన పడింది. మిగతా జిల్లాల్లో ఒకటెండ్రు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడింది. సోమవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో, మిగతా జిల్లాల్లో ఒకటెండ్రు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు కూడా వీస్తాయి. ఇదిలా ఉండగా, మరోవైపు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపీ రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే సూచనలున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే సూచనలున్నాయి. ఈ మేరకు ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే సూచనలున్నాయని హెచ్చరించింది.

ట్రాఫిక్ పోలీసు అత్యుత్సాహానికి ఒకరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్‌లో విషాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో భాగంగా బైక్‌ను ఆపే క్రమంలో ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి కిందపడ్డారు. వెంటనే అతని తలపై నుంచి ఆర్‌టిసి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐడిపిఎల్ గేటుకు ఎదురుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపి సరైన పత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే సమయంలో షాపూర్‌నగర్ నుంచి పంజాగుట్ట ద్విచక్రవాహనంపై వెళ్తున్న జోష్ బాబు (32)ను ఓ ట్రాఫిక్ పోలీసు ఆపే క్రమంలో వాహనదారుడి కాలర్ పట్టుకున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి కింద పడ్డారు. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఆయన తలపై నుంచి వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

నేటి నుంచి ఎస్‌సి వర్గీకరణ

- అమల్లోకి రానున్న చట్టం
- అంబేద్కర్ జయంతిన ఉత్తర్వులు
- దశాబ్దాల డిమాండ్‌కు కాంగ్రెస్ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి ఎస్‌సి వర్గీకరణ చట్టం అమల్లోకి రానున్నట్టు మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వర్గీకరణ అంశం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలులోకి తెచ్చామని ఆయన తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్‌సి వర్గీకరణపై వేసిన మంత్రివర్గ ఉపసంఘం కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సబ్ కమిటీ ఉపాధ్యక్షులు, మంత్రి దామోదరం రాజనరసింహతోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎస్‌సి వర్గీకరణ వన్‌మెన్ కమిషన్‌కు అధ్యక్షత వహించిన రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్, ఎస్‌సి అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదర్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ చట్టానికి తుది రూపం ఇచ్చినట్టు స్పష్టం చేశారు. మంత్రివర్గ ఉపసంఘం ఆమోదించిన ఎస్‌సి వర్గీకరణ తొలి ప్రతిని సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. జస్టిస్ షమీమ్ మక్తర్ ఆధ్వర్యంలో కమిషన్ రూపొందించిన సిఫారసులను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మంత్రివర్గ ఉపసంఘం వర్గీకరణ చట్టాన్నీ ఆమోదించినట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను 59 ఎస్‌సి ఉప కులాల మధ్యన ఉన్న అంతర్గత వెనుకబాటుతనాన్ని ఆధారం చేసుకుని మూడు గ్రూపులుగా విభజించినట్టు ఆయన తెలిపారు. మొదటి గ్రూప్‌లో 15 ఉప కులాలు అత్యంత వెనుకబాటుతనంలో ఉండగా, ఆ 15 కులాల జనాభా 3.288 శాతంగా ఉందని ఆయన చెప్పారు. ఆ జనాభా ఆధారంగా వీరికి ఒక్క శాతం రిజర్వేషన్లు వర్తింప జేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. అదే విధంగా రెండో గ్రూప్ లో రిజర్వేషన్ల ఆధారంగా అంతంత మాత్రం లబ్దిపొందిన ఉప కులాలు 18 ఉన్నాయనీ, ఎస్సీ జనాభాలో ఈ 18 కులాల జనాభా 62.74 శాతంగా ఉన్నందున వీరికి తొమ్మిది శాతం రిజర్వేషన్లు కేటాయించినట్టు వివరించారు. మూడో గ్రూప్‌లో పై రెండు గ్రూప్ లతో పోలిస్తే ఒకింత ముందున్న 26 కులాల జనాభా 33.963 ఉండగా వారికి ఐదు శాతం రిజర్వేషన్లను కేటాయించినట్టు వెల్లడించారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మకమైన తీర్పుతో ప్రభుత్వం తక్షణమే స్పందించి జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ చైర్మన్‌గా నియమించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కమిషన్ వేసిందే తడవుగా ఎస్‌సి ఉపకులాల సామాజిక ఆర్థిక స్థితి గతులపై లోతుగా అధ్యయనం చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 8,600 పైగా వినతులు స్వీకరించినట్టు ఆయన వివరించారు. అంతే కాకుండా ఎస్సీ కులాల జనాభా ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, విద్యా అవకాశాలపై సమగ్రమైన సమాచారాన్ని తీసుకున్నట్టు ఆయన తెలిపారు. అదే సమయంలో వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు రావడంతో కమిషన్ గడువు వ్యవధిని అదనంగా మరో నెల పెంచి అందరి అభిప్రాయాలను సేకరించినట్టు ఆయన చెప్పారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ డిమాండ్ దశాబ్దాలుగా నానుతూ వచ్చిందన్నారు. సుదీర్ఘకాలంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించిన తాను ఈ అంశాన్ని 1999 నుంచి ప్రతీ శాసనసభ సమావేశాల్లో ప్రత్యక్షంగా చూసినట్టు తెలిపారు. ఎస్‌సి వర్గీకరణపై గత శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వర్గీకరణను ఖచ్చితంగా అమల్లోకి తెస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి చిత్తశుద్ధిని చాటుకున్నామన్నారు. అందుకు అనుగుణంగానే తెలంగాణా శాసనసభలో ఎస్సీ వర్గీకరణను ఏకగ్రీవంగా ఆమోదించుకోవడంతో పాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదించిన విషయాన్ని ఆయన ఉటంకించారు. అదే సమయంలో కమిషన్ ప్రతిపాదించిన క్రిమిలేయర్ ప్రతిపాదనను సైతం తిరస్కరించినట్టు ఆయన తేల్చి చెప్పారు. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఉప కులాల హక్కులను హరిస్తే ఏర్పడబోయే పరిణామాలను గమనించిన మీదట వర్గీకరణ ధర్మబద్ధంగా ఉండేలా తుది రూపు ఇచ్చినట్టు ఆయన చెప్పారు.

పెరిగిన ఎస్‌సిల జనాభా

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణాలో ఎస్‌సిల జనాభా 17.5 శాతానికి చేరిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2026 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం ఎస్‌సిలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్లను పెంచే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం యోచన చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

కార్మికులకు కష్టాలు..కార్పొరేట్లకు లాభాలు

- సిఐటియు సామాజిక న్యాయసాధన బైక్ ర్యాలీలో పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు కష్టాలు పెంచి, కార్పొరేట్లకు లాభాలు దోచిపెట్టే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. సిఐటియు మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయసాధన యాత్రలో భాగంగా ఆదివారం మేడ్చెల్ జిల్లాలోని ఇసిఐఎల్ అంబేద్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో కార్మికులు స్వచ్ఛందంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. దాదాపు 15 కిలోమీటర్ల మేర సాగిన బైక్ ర్యాలీని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మోటారు సైకిళ్లకు ఎర్రజెండాలు కట్టి, మనువాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సాగిన ర్యాలీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయాలపై ప్రజల్లో చర్చను రేకెత్తించేలా సాగింది. ప్రపంచ కార్మికుల ఐక్యత వర్థిల్లాలంటూ ర్యాలీలో పాల్గొన్న కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. 'దోపిడికి, పీడనకు వ్యతిరేకంగా పోరాడుదామంటూ గళమెత్తారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందామంటూ ప్రతినబూనారు. అనంతరం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ శ్రమదోపిడి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడుతుందని చెప్పారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశ సామాజిక చరిత్రలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన మహానాయకుడని గుర్తు చేశారు.

"భూ భారతి"కి వందేళ్ల కాలపరిమితి

- సామాన్యులకు అర్థమయ్యేలా వెబ్‌సైట్
- విశ్వసనీయ సంస్థకు పోర్టల్ బాధ్యతలు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే వందేళ్ల పాటు రైతులకు, ప్రజలకు నమ్మకమైన, నాణ్యమైన సేవలందించేలా తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025 వెబ్‌సైట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసంలో ఉన్నతాధికారులతో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సామాన్య రైతులకు సైతం అర్థమయ్యేలా వెబ్‌సైట్ ఉండాలని సూచించారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా అత్యాధునికమైన పకడ్బందీ ఫైర్‌వాల్ ఉండాలని ఆదేశించారు. గతానుభవాల నేపథ్యంలో భూభారతి నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలన్నారు. నేడు హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో ఆవిష్కరించున్న భూభారతి పోర్టల్‌ను తెలంగాణ జాతికి అంకితం చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, సీసీఎల్‌ఏ కార్యదర్శి మకరంద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2029 ఎన్నికలకు 'భూభారతి' రెఫరెండం

– రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'భూభారతి' చట్టం రానున్న 2029 శాసనసభ ఎన్నికలకు రెఫరెండమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. బీ.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను ప్రజలకు అంకితం చేస్తారని తెలిపారు. "రాష్ట్రంలో ప్రజల భూముల పరిరక్షణ బాధ్యత ఈ ప్రభుత్వానిదే. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అందరికీ ఆమోదయోగ్యమైన భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం" అని పొంగులేటి అన్నారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా రైతులు, మేధావులు, నిపుణులతో చర్చించి చట్టాన్ని రూపొందించామని చెప్పారు. ధరణి ముసుగులో గతంలో

జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెల మొదటివారంలో గ్రామ రెవెన్యూ పాలనాధికారుల వ్యవస్థను అమల్లోకి తెస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో తొలుత మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ చట్టాన్ని అమలు చేయబోతున్నామన్నారు. వాటి నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా జూన్ 2నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు.

ప్రజలకు చేరువయ్యేలా చట్టంలో మార్పులు

భూభారతి చట్టంలో ప్రజలకు చేరువయ్యేలా చట్టంలో భారీ మార్పులు చేసినట్టు పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు. "ఎమ్మార్వో నుంచి సీసీఎల్‌ఏ వరకు ఐదు స్థాయిల్లో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాలు వికేంద్రీకరణ చేశాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తాం. తర్వాత కాలంలో సమస్యలు తగ్గితే ట్రిబ్యునళ్లను కుదిస్తాం. ధరణిలో గతంలో ఉండే 33 మాడ్యూళ్లను ఆరుకు తగ్గించాం. ఫలితంగా ఈ పోర్టల్ అందరికీ సులభతరంగా అందుబాటులో ఉంటుంది. గతంలో ధరణిని తీసుకువచ్చిన సమయంలో దాదాపు నాలుగు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా క్రమక్రమంగా పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నాం. భూ యజమానులు తమ భూమి వివరాలు తెలుసుకునేందుకు ఒకేసారి పోర్టల్‌ను సందర్శించవద్దు. అలా చేస్తే మొత్తం పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉంది. ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా పోర్టల్‌కు ఇబ్బందులు చేయాలని భావిస్తే తగు చర్యలు తీసుకోవాలని సీఎం ఇప్పటికే పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోర్టల్‌లోని ఆధునిక అంశాలను జోడిస్తూ అత్యాధునిక వెర్షన్‌ను ప్రజలకు అందించే ప్రయత్నాలు చేస్తున్నాం" అని వివరించారు.

కట్టంగూర్ మండల సమగ్రాభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయాలి

- ప్రజా పోరుబాటలో ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కట్టంగూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి రూ.100 కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుబాట సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా కట్టంగూరు మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నా, జిల్లా కేంద్రానికి.. రాష్ట్ర రాజధానికి దగ్గరల్లో ఉన్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల మండలం అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. మండలంలో రైతాంగానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఐటిపాముల్లో లిఫ్ట్ ఏర్పాటుచేసి సాగునీరు అందిస్తామని అధికారంలో ప్రభుత్వాలు హామీలిస్తూ శంకుస్థాపనలు చేస్తున్నారు తప్ప పనులు వేగవంతం చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి లిఫ్ట్‌ను పూర్తి చేసి చెరువులను, కుంటలను నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆసిఫ్‌నహర్ కాలువ పూడికలు తీసి మండలంలోని చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. ఈ జిల్లాకు రోడ్డు రవాణా శాఖ మంత్రి ఉన్నా మండలంలోని లింకు రోడ్లు, బీటీ రోడ్లు మాత్రం అధ్వానంగా తయారయ్యారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రయివేటీకరణ చేస్తుంది తప్ప పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పదేండ్లు పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తానని చెప్పి 16 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిగా అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, పాదయాత్ర సభ్యులు చిలుముల రామస్వామి, మురారి మోహన్, జాల రమేష్, గడగోజు రవీంద్రాచారి, గర్ధ సతీష్, జాల ఆంజనేయులు, చిలుకూరు సైదులు, ఊట్కూరు సుజాత శ్రీను, చెరుకు లక్ష్మయ్య, ముసుకు రవీందర్, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులిని గాలిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

మేడారం అడవిలో పెద్దపులి..

- గేదెపై దాడి చేసి చంపిన వైనం
- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. పులి మేడారం వైపు వెళ్లినట్టు ఫారెస్ట్ సిబ్బంది అడుగులు గుర్తించారు. పెద్దపులి కోసం అన్వేషిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. వివరాల్లోకెళ్తే... ములుగు జిల్లా మేడారం టెరిటోరియల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ రేంజ్ పరిధిలో సరిహద్దు అటవీ ప్రాంతాల్లో.. పులి సంచరిస్తుందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. మేడారం, మహదేవపూర్ సరిహద్దు అడవిలో బయ్యక్కపేట– కాల్వపల్లి అడవి మధ్యలో బాంచమడుగు, రెండు వాగుల గడ్డ ప్రాంతంలో ముసలమ్మపెంట గుత్తికోయ గూడెంకు చెందిన పొడియం సత్యం అనే ఆదివాసీ గిరిజన రైతు ఆవుపై రెండు రోజుల క్రితం (11వ తేదీ) పులి దాడి చేసి చంపినట్టు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. పులి పాదముద్రలనూ గుర్తించారు. దాంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ఆదేశాల మేరకు మేడారం (బయ్యక్కపేట) రేంజ్ ఆఫీసర్ ఎల్లయ్య ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. పులి సంచారం అడుగుజాడలు తెలుసుకునేందుకు తాడ్వాయి మండలంలోని బయ్యక్కపేట, కాల్వపల్లి, నార్లాపూర్, సరిహద్దు మండలాలైన కన్నాయిగూడెం మండలం ఐలాపూర్, ఎటునాగారం మండలం, కొండాయి అడవుల్లో ముమ్మరంగా గాలింపుచర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భయాందోళనలకు గురికావొద్దని సూచించారు. అటవీ ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లొద్దని గిరిజనులను హెచ్చరించారు. అలాగే వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టొద్దని, చూసినా, అడుగులు గమనించిన.. దగ్గర్లోని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పెట్రోల్ లూజ్ సేల్స్ నిబంధనలకు విరుద్ధం

- మాచన రఘునందన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెట్రోల్ బంక్ యజమాన్యాలు బల్క్ లూస్ సేల్స్‌కు ఫుల్ స్టాప్ పెట్టాలని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటి తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్‌ను ట్రాక్టర్‌లో వచ్చిన డ్రమ్ముల్లో పోసి పంపిస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇలా ఇంధనాన్ని విడిగా పెద్ద మొత్తంలో విక్రయిస్తే..పెట్రోల్ బంక్ యజమానులు ఇంధనాన్ని బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని జనం భావించే పరిస్థితి తలెత్తగలదని రఘునందన్ హెచ్చరించారు. పీపాల్లో ,డ్రమ్ముల్లో పెట్రోల్, డీజిల్‌ను పట్టుకు పోయిన వాళ్లు ఇంధనాన్ని అధిక ధరకు అమ్ముకునే అవకాశం లేకపోలేదన్నారు. పెట్రోల్ పేలుడు పదార్థాల క్యాటగిరీలోకి వస్తుంది కాబట్టే..అగ్నిమాపక పరికరాలు, సాధనాలు ఉన్న ప్రాంగణంలోనే పెట్రోల్‌ను అమ్మాలని రఘునందన్ వివరించారు. లూస్ పెట్రోల్ అమ్మితే ఇంధనంలో నాణ్యత లేకున్నా.. ఇంధన కల్తీకి పెట్రోల్ బంక్ యజమానులే భాధ్యత వహించాల్సి వస్తుందని మాచన హెచ్చరించారు.

బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని విద్యార్థి ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఒక విద్యార్థి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్ ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ రెడ్డి(21) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతడు కొద్ది రోజులుగా క్రికెట్‌లో బెట్టింగ్ పెడుతున్నాడు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్ భారీగా నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పులు ఎక్కువ అవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ కోసం రూ. 170 కోట్ల కమీషన్

- ఐసిఐసిఐ వద్ద అప్పు తెచ్చింది వాస్తవం కాదా? : మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెచ్‌సీయూ భూములు టిజిఐఎస్‌సికి ఇచ్చిన మాట వాస్తవం కాదా? బాండ్ల రూపంలో ఐసిఐసిఐ వద్ద టిజిఐఎస్‌సి అప్పు తెచ్చిందా? లేదా? ద్వైపాక్షిక ఒప్పందం చేసుకుని రుణం తీసుకున్న మాట వాస్తవం కాదా? లోన్ తీసుకురావడానికి రూ.170 కోట్ల కమిషన్ ఇచ్చారా? లేదా? అంటూ బిజెపి ఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాటలు ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధిలోకి రాకుండా టిజిఐఎస్‌సి ద్వారా ప్రభుత్వం రుణాలు తెచ్చిందని విమర్శించారు. రెండు కిందనే రెండు వేల బాండ్ల ద్వారా ప్రభుత్వంలోన్లు తెచ్చిందన్నారు. హరీశ్‌రావు, పన్నేరావు పిపి కలిసి ఎకరాకు రూ.74 కోట్ల నుంచి రూ.53 కోట్లకు తగ్గించారని ఆరోపించారు. మద్రాస్ చీకటి ఒప్పందంలో భాగంగానే రెండు పార్టీలు బిజెపిని బద్నాం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో హెచ్‌సియు భూముల్నే కాదు.. దేన్నీ అమ్మనీయకుండా ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు.

ఐక్యత పోరాటాలతోనే హక్కులు సాధ్యం

- 40 ఏళ్ల నుంచి ఒకే యూనియన్ ఉండడం చారిత్రాత్మకం : సుధాభాస్కర్
- కార్మికుల సంక్షేమంలో రాజీలేని పోరాటం : ఎం కృపేందర్
- మారిన పరిస్థితుల్లో గత విజయాలే పునాదిగా మరింత ఐక్యంగా గోల్డెన్ జూబ్లీ వైపు సాగుదాం : చుక్క రాములు
- ఘనంగా శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ 40వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐక్యత పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతామని, 40 ఏళ్ల నుంచి ఒకే యూనియన్ ఉండటం చారిత్రాత్మకమని శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ మాజీ అధ్యక్షులు, నవతెలంగాణ పత్రిక సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ (పూర్వపు విడియా ఎంప్లాయీస్ యూనియన్) స్థాపించి 40 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మండలంలోని కర్దనూర్‌లో గల జేపీ కన్వెన్షన్ హాల్‌లో శాండ్విక్ 40వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సుధాభాస్కర్‌తో పాటు యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం కృపేందర్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాభాస్కర్ మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా కార్మిక సంక్షేమంలో రాజీలేకుండా ఒకే నాయకత్వంలో 40 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. కొన్ని రోజులుగా ప్రపంచ పరిణామాలు గమనిస్తే అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలు, టారిఫ్ యుద్ధం వల్ల ప్రపంచ వాణిజ్యంలో తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్న విషయం మనం చూస్తున్నామన్నారు. ఈ ప్రభావం మనం అవునన్నా కాదన్నా పరిశ్రమల మీద పడటంతో పాటు ఆ ప్రభావం కార్మికవర్గం మీద కూడా పడుతుందని తెలిపారు. కాబట్టి సాధించిన విజయాలు శాశ్వతమని అనుకోవడానికి వీల్లేదని, వాటిని నిలబెట్టుకోవాలంటే కార్మికవర్గం ఐక్యంగా నిలబడాలని, రాజకీయ చైతన్యంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఎం. కృపేందర్ మాట్లాడుతూ.. 1985లో యూనియన్ నెలకొల్పాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని అని, ఒక విధంగా ఉద్యోగాలను పణంగా పెట్టి యూనియన్ రిజిస్టర్ చేశామని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ యూనియన్ ఎన్ని యాజమాన్యాలు మారినా కార్మిక సంక్షేమంలో రాజీ లేకుండా నేడు 40వ వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అందరినీ కలుపుకొనిపోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో గోల్డెన్ జూబ్లీ వైపునకు ఎస్ఈయూ ప్రయాణం సాగాలని పిలుపునిచ్చారు. చుక్క రాములు మాట్లాడుతూ.. 1985 ఏప్రిల్ 9న స్థాపించిన విడియా ఎంప్లాయీస్ యూనియన్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ అనేక యాజమాన్యాలు మారి నేడు శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్‌గా 40 ఏండ్లు పూర్తిచేసుకొని వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రారంభం నుంచి కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా సీఐటీయూ మార్గ నిర్దేశకత్వంలో కార్మికులనందరినీ ఐక్యంగా నిలబెట్టడం ద్వారానే ఇది సాధ్యమైందని తెలిపారు. 14 వేతన ఒప్పందాల ద్వారా కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచామన్నారు. ఒక్క కార్మిక సంక్షేమంలోనే కాకుండా సామాజిక, సంఘీభావ కార్యక్రమాల్లో సైతం కార్మికులను భాగస్వాములను చేస్తూ ముందు నుంచి అందరికీ ఆదర్శవంతమైన కృషి శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ చేసిందని చెప్పారు. మారిన పరిస్థితుల్లో గత విజయాలే పునాదిగా మరింత ఐక్యంగా ముందుకు సాగి గోల్డెన్ జూబ్లీ వైపు ముందుకు వెళ్దామని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్, సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, ఉపాధ్యక్షులు కె.రాజయ్య, శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, మాజీ హెచ్‌ఆర్ హెడ్స్, మాజీ మేనేజర్స్, పరిశ్రమ ప్రతినిధులు, వివిధ పరిశ్రమల సిఐటియు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త

సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే అధికారం

- బిజెపి, కాంగ్రెస్‌లకు కర్రు కాల్చి వాతపెట్టాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే అధికారమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి తప్ప ఎవరూ సంతోషంగా లేరని తెలిపారు. ఒకసారి ఒక వ్యక్తి చేతిలో మోసపోతే తప్పు వాళ్లదైతదని, రెండోసారి మోసపోతే తప్పు మనదైతదన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ సందర్భంగా ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలోని లక్ష్మీ సాయి గార్డెన్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. కెసిఆర్ పెళ్లయిన ఆడబిడ్డలకు రూ.లక్ష ఇస్తే దానిమీది కెళ్లి తులం బంగారం ఇస్తానని, పదివేలు ఇస్తే పదిహేను వేలు ఇస్తానని, రూ. వేల పింఛన్ ఇస్తే నాలుగు వేలు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి మోసం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో సంతోషంగా ఉన్నది రేవంత్ రెడ్డి ఒక్కరేనని, మంత్రి వర్గంలో పనిచేసే వారు కూడా బాధలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎంబిసి చైర్మన్ నంది కంటే శ్రీధర్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాకీలు పెట్టి లేపినా కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి రాదు

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాకీలు పెట్టి లేపితే కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి రాదని, ప్రజలు పాతాళంలోకి తొక్కడం ఖాయమని 18 నెలల్లోనే తేలిపోయిందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని శోభ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బ తీసిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతంలో పూర్తిగా రియల్ వ్యాపారం పడిపోయి ఆర్థికంగా, సామాజికంగా ప్రజలు దెబ్బతిన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రోజురోజుకు ప్రజాదరణ కోల్పోతుందని, అధికారంలోకి ఎంత స్పీడ్‌గా వచ్చిందో అంతే స్పీడ్‌గా పాతాళంలోకి వెళ్లిపోయిందన్నారు.

రాష్ట్ర ప్రజలు కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలు ఎక్కడా అమలు చేయలేదని, చేసినా ఆ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందడం లేదన్నారు. సెక్రటేరియట్‌లో కాంట్రాక్టర్లు ధర్నా చేస్తున్నారని, ఇటువంటి ప్రభుత్వాలు ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పెద్దలు 20 శాతం కమిషన్లు తీసుకొని బిల్లులు కొడుతున్నారని ఆరోపించారు. రూ14 వేల కోట్ల రైతుబంధు, అసంపూర్తిగా రుణమాఫీ చేయడంతో రైతుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందని అన్నారు. ఒడ్లు కొనమని అడిగితే నూకలు బుక్కొండి అని బీజేపీ ప్రభుత్వం అంటుంటే, అదే బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేస్తుందని తెలిపారు. సన్న బియ్యం పేరిట నూకలు పంపిణీ చేస్తున్నారని, 40 శాతం నూకలే ఉన్నాయని ఆరోపించారు. ప్రజలను మరిపించేందుకు సామూహిక భోజనాలు చేస్తున్నారన్నారు. 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి పదివేల కోట్ల రూపాయల అప్పు తీసుకొచ్చారని, దీన్ని సమాచార హక్కు చట్టం ప్రకారం పబ్లికేషన్ పెట్టిన రేవంత్ రెడ్డి సర్కారులో పనిచేస్తున్న అధికారులను బలి చేస్తున్నారని అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ సభను విజయవంతం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజమౌళి, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బైరంపల్లిలో దళితులకు అడుగడుగునా అవమానాలు

- గుడి మైల పడిందని వారం రోజుల నుంచి శుభ్రం చేయని వైనం, గుడికి తాళం
- కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుడిలోకి ప్రవేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిడ్జిల్ మండలం బైరంపల్లి గ్రామంలో ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామనవమి సీతారాముల కళ్యాణం చూసి అక్షింతలు వేయడానికి ఇద్దరు చదువుకున్న దళిత మహిళలు గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గరికి వచ్చి అక్షింతలు వేస్తుంటే దళితులు గుడిలోకి రాకూడదని బయటికి పంపించేశారు. దళిత మహిళలు గుడిలోకి వచ్చినందుకు గుడి మైల పడిందని అగ్ర కులాలకు చెందిన కొందరు గుడికి తాళం వేశారు. దళితులు గుడిలోకి వచ్చారని, వారం రోజుల నుంచి గుడిని శుభ్రం చేయలేదు కూడా. ఆదివారం ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో కెవిపిఎస్, ప్రజాసంఘాల నాయకులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. మాణిక్యం రాజు, ఎం. కురుమయ్య, ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రాములు తదితరులు మాట్లాడుతూ.. గుడికి తాళం వేసి వారం రోజులైనా తహసీల్దార్, ఎస్ఐ అక్కడికి రాకపోవడం విచారకరమన్నారు. ఇదే సమయంలో మిడ్జిల్ ఎస్ఐ బృందం ఆ గ్రామానికి చేరుకున్నారు. గుడి తలుపులు తీసి అందరం గుడిలోకి వెళ్లాలని పోలీసులు చెప్పినా అగ్రకులాల వాళ్లు ఒప్పుకోలేదు.. 'మీరు వెళ్లండి.. మేము రామ'ంటూ తెగేసి చెప్పారు. దాంతో ప్రజా సంఘాలు, పోలీసుల జోక్యంతో దళిత యువకులు రమేష్, ఈశ్వర్, విష్ణు, కల్యాణ్, మన్యం జంగయ్య తదితరులను గుడిలోకి తీసుకెళ్లి టెంకాయలు కొట్టించారు. దళితులు వారి మొక్కును తీర్చుకున్నారు. దాంతో అనేక సంవత్సరాల నుంచి గుడిలోకి పోవాలన్నా వారి కోరిక ఆదివారం నెరవేరింది.

ఈ సందర్భంగా దళిత యువకులు తమపై జరుగుతున్న కులవివక్షను ఎకరవుపెట్టారు. గ్రామంలో అడుగడుగునా దళితులను అవమానాలకు, వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. రెండేండ్ల కిందట గుడి దగ్గరికి అడుగుల భజన చేయడానికి వెళ్లిన దళిత యువకుడిని భజన చేయకుండా వెళ్లగొట్టారన్నారు. 2023లో శివసత్తుల బోనాలు గ్రామంలో వెళ్లినప్పుడు ఎస్సీల బోనాలను కిందపడేశారని తెలిపారు. తమను బొడ్రాయి దగ్గరికి కూడా రానివ్వని అన్నారు. కాగా, ఇన్ని రకాలుగా కుల వివక్షత కొనసాగుతుంటే.. మిడ్జిల్ రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ, ఆ గ్రామంలో సివిల్డర్స్ డే ఎందుకు నిర్వహించలేదని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా బైరంపల్లి గ్రామాన్ని, కలెక్టర్, ఎస్పి సందర్శించి, ఎస్సి, బిసి అందర్నీ కలిపి దేవాలయ ప్రవేశం చేయించి వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గుడిలోకి వెళ్లొచ్చిన దళితలు, కెవిపిఎస్ నాయకులు

దళితుల దేవాలయ ప్రవేశం అడ్డుకుంటే చర్యలు తప్పవు : తహసీల్దార్ రాజు, ఎస్ఐ శివ నాగేశ్వర్ నాయుడు

దళితుల దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అంబేద్కర్ రాజ్యాంగంలో అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించారని, ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే భావన లేకుండా ప్రజలందరూ గ్రామంలో సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలి. విడదీసి పాలించే నాయకులకు చట్టపరంగా చర్యలు తప్పవు.

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో సహాయక చర్యలు వేగవంతం

- కొనసాగుతున్న బండరాళ్ల తొలగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ఎస్ఎల్‌బిసి, సొరంగంలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో, ప్రమాద స్థలం సమీపంలోని పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ సహాయంతో విచ్ఛిన్నం చేసి, లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్టు టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలో గల ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ, సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యల్లో దినదినంగా పురోగతి సాధిస్తున్నట్టు తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు, వెంటిలేషన్ పొడిగింపు, మట్టి తవ్వకాలు, టీబీఎం భాగాలను కత్తిరించే పనులు, స్టీలును బయటకు తరలించే పనులు, ఊట నీటిని బయటకు పంపింగ్ చేసే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సహాయక బృందాలు నిర్విరామంగా టన్నెల్ లోపల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు వివరించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక బందాలు తమ సహాయక చర్యల ద్వారా మట్టి తవ్వకాలకు ఏర్పడే ఆటంకాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రతి చిన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రమాద ప్రదేశానికి చేరుకునే మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా, సహాయక చర్యల వేగం పెరిగే అవకాశం ఉందన్నారు. జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు, నీటిపారుదల శాఖ నిపుణులు, టన్నెల్ నిర్మాణాల్లో అనుభవం కలిగిన ఇంజినీర్లు, ఇతర సంబంధిత శాఖల నిపుణుల సూచనలు, సలహాలను అనుసరిస్తున్నామన్నారు. ప్రతి చిన్న అంశాన్ని కూడా సాంకేతికంగా విశ్లేషిస్తూ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సహాయక చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.